గోదారి తీరం.. ఆధ్యాత్మిక సౌరభం

- పవిత్ర కార్తిక మాసంలో విశేష పూజలు
- 29వ తేదీన విస్తృత కార్యక్రమాలు
- లక్ష రుద్రాక్షలతో పరమశివుని అర్చన
- నగరంలో విధుశేఖర భారతీ మహాస్వామి అనుగ్రహ భాషణం
- శివపార్వతుల కల్యాణంతో పులకింత


పుష్కరాల రేవులో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు


అనుగ్రహ భాషణం చేస్తున్న విధుశేఖర భారతీ మహాస్వామి

సీటీఆర్ఐ: పరమ పవిత్రమైన కార్తిక మాసంలో గోదావరి తీరాన ఆధ్యాత్మిక సౌరభాలు వెల్లివిరుస్తున్నాయి. ఈ నెల 29న శుక్రవారం కార్తిక మాసంలో వచ్చే మాస శివరాత్రి రోజున నగరంలో అనేక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాగా గత రెండు రోజులుగా రాజమహేంద్రవరం నగరంలో విధుశేఖర భారతీ మహాస్వామి అనుగ్రహ భాషణం, పూజ కార్యక్రమాలతో భక్తులు పరవశిస్తున్నారు. బుధవారం గోదావరి గట్టున ఉన్న శృంగేరి శంకర మఠంలో స్వామి వారు అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శారదాంబ, శంకరాచార్య, దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ స్వామివారి ఆధ్వర్యంలో జరిగాయి. 1910లో వాసుదేవానంద సరస్వతి స్వామి ప్రతిష్ఠించిన దత్త పాదుకలను విధుశేఖర భారతీ మహాస్వామి పునఃప్రతిష్ఠ చేశారు. ఈ నెల 29న స్థానిక విరించి వాన ప్రస్థాశ్రమంలో పిల్లల అంధత్వ నివారణ కోసం మహాపాశుపత రుద్రహోమం నిర్వహించనున్నారు.

1,08,012 రుద్రాక్షల మహార్చన

పరమ శివుడికి ఎంతో ప్రీతిపాత్రమైన కార్తిక మాసంలో నిర్వహిస్తున్న 1,08,012 రుద్రాక్షల మహార్చన 29వ తేదీన జరగనుంది. గాడాలలో ఉన్న మహాలక్ష్మి సమేత చినవేంకటేశ్వర పీఠంలో పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు స్వామిజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. పరమ శివుడికి ప్రీతికరమైన రుద్రాక్షలు శివ పంచాక్షరి మంత్రంతో అర్చన చేస్తే సకల శుభాలు కలుగుతాయని స్వామిజీ చెప్పారు. 54 రుద్రాక్షలతో అర్చన చేస్తే


షర్మిలారెడ్డికి ఆహ్వానం అందిస్తున్న చిన్నవెంకన్నబాబు స్వామిజీ

సమస్త అనారోగ్య బాధలు తొలగి పరిపూర్ణ ఆరోగ్యవంతులు అవుతారన్నారు. 27 రుద్రాక్షలతో


ఆర్ట్స్ కళాశాలలో వేసిన కైలాసం సెట్

అర్చన చేస్తే సమస్త కోరికలు నెరవేరుతాయన్నారు. 108 రుద్రాక్షలతో పూజిస్తే ధర్మార్థ కామ మోక్షాలతో పాటు, ధర్మబద్ధమైన సకల ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమానికి నగరంలోని పలువురు ప్రముఖులను ఆహ్వానించారు. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, రుడా మాజీ చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తదితరులను ఆహ్వానించారు.

శివపార్వతుల కల్యాణం

అదేవిధంగా ఈ నెల 29న స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో శివపార్వతుల కల్యాణం జరగనుంది. ఇందుకు సంబంధించి కళాశాల ప్రాంగణంలో కైలాసం సెట్ వేశారు. ఈ కార్యక్రమానికి విధుశేఖర భారతీ మహాస్వామి అనుగ్రహ భాషణం చేయనున్నారు.

ఆధ్యాత్మికత శోభిల్లుతోంది



దక్షిణ కాశీగా పేరుగాంచిన పవిత్ర గోదావరి తీరంలో కార్తిక మాసం అంతా ఆధ్యాత్మికతతో శోభిల్లుతోంది. ప్రతి రోజూ అనేక పూజలు దేవాలయాల్లో నిర్వహిస్తున్నారు. శివలింగానికి అభిషేకం, వేకువజామున నదీ స్నానం, దీపార్చన ఈ మాసంలో అనేక శుభ ఫలితాలు ఇస్తాయి.

– పెద్దింటి నీలకంఠశర్మ, అర్చకుడు, ఉమామార్కండేయ స్వామి ఆలయం

సకల శుభాలు కలుగుతాయి



కార్తిక మాసంలో మహిళలు తమ సౌభాగ్యం కోసం మాసం అంతా పూజలు చేస్తారు. అంతేకాకుండా వేకువజామునే నదీ స్నానం ఆచరించి, దీపాలను నదిలో వదిలి సౌభాగ్యాన్ని ప్రసాదించమని వేడుకుంటారు. 29వ తేదీ శుక్రవారం నగరంలో అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతున్నాయి.

– పి.విశాలాక్షి, తెలుగు అధ్యాపకురాలు

క్లుప్తంగా

జాతీయ పోటీల్లో శాటిలైట్‌సిటీ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని డైట్‌లో మంగళవారం నిర్వహించిన జాతీయ బాలరంగ్ పోటీల్లో శాటిలైట్‌సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులు దింసా నృత్య ప్రదర్శనలో తృతీయ స్థానం సాధించారు. బుధవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులను హెచ్‌ఎం బత్తిన రాజరాజేశ్వరి, ఉపాధ్యాయులు డి.రాముడు, వినోద్ తదితరులు అభినందించారు.

పుష్కరాల రేవులో అన్న సమారాధన


అన్న సమారాధన నిర్వహిస్తున్న సభ్యులు

సీటీఆర్ఐ: కార్తిక మాసంలో అన్న సమారాధన చేయడం పుణ్యఫలమని జిల్లా బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాస్ అన్నారు. కార్తిక మాసం సందర్భంగా స్థానిక పుష్కరాల రేవులో 12 ఏళ్లుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గౌతమి గోదావరి పుష్కరాల రేవు పురోహిత సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు ఐదు వేల మంది పాల్గొన్నారు. సంఘ అధ్యక్షుడు దూర్వాసుల సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు సుబ్బరాయ శాస్త్రి, నిర్వాహకులు భమిడిపాటి కృష్ణ శర్మ, తదితరులు పర్యవేక్షించారు.

29న అన్నదానానికి విస్తృత ఏర్పాట్లు

కడియం: కడియపులంకలోని హరిహర మహాక్షేత్రంలో కార్తిక మాసం మాస శివరాత్రి సందర్భంగా ఈ నెల 29న అన్నదాన కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ మార్గాని సత్యనారాయణ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఏటా ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నామని చెప్పారు. సుమారు 50 వేల మంది భక్తులు వస్తారన్న అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు దేవరభట్ల శ్రీనివాసరావు శర్మ, శ్రీనివాసాచార్యులు, శేషాచార్యులు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

కడియం: మండలంలోని వీరవరం వీవర్స్ కాలనీలో ఉన్న లక్ష్మీగణపతి నందీశ్వర స్వామి, చౌడేశ్వర దేవి ఆలయ పునర్నిర్మాణానికి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి రూ.50 వేల విరాళాన్ని బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. దాతల సహకారంతో పురాతన ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.

ఏకాగ్రత పెంచేందుకు క్రీడలు దోహదం


జైస్మిత్ సాయిని అభినందిస్తున్న శ్యాంసుందర్, గురయ్య

రాజమహేంద్రవరం రూరల్: క్రీడలు ఏకాగ్రతను పెంచుతాయని, శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడతాయని సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ ఏ.శ్యాంసుందర్ అన్నారు. ఇటీవల కోనసీమ జిల్లా రామచంద్రపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలు అండర్=10 విభాగంలో గురుకులం విద్యార్థి డి.జైస్మిత్ సాయి స్వర్ణ పతకం సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం రాజమహేంద్రవరంలోని సత్యసాయి గురుకులంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో శ్యాంసుందర్ మాట్లాడారు. ప్రిన్సిపాల్ కె.గురయ్య మాట్లాడుతూ, విద్యార్థుల్లో నైపుణ్యాలను గుర్తించి, ప్రోత్సహిస్తున్నామన్నారు. డిసెంబర్ చివరి వారంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు జైస్మిత్ సాయి రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో పీజీ కోర్సుల్లో స్పాట్‌అడ్మిషన్లను గురువారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఏపీపీజీసీఈటీ–24 రాయకపోయినా అడ్మిషన్‌కు అర్హులని చెప్పారు. తెలుగు–52, ఎంకాం–40, ఎకనమిక్స్–30, పొలిటికల్ సైన్స్–25, మ్యాథ్స్–34, ఫిజిక్స్–24, ఆర్గానిక్ కెమిస్ట్రీ–4 ఈడబ్ల్యూ, ఫిజికల్ కెమిస్ట్రీ –5, బోటని–18, జువాలజీ–8, ఆక్వాకల్చర్–13 సీట్లు ఖాళీగా ఉన్నాయని పీజీ కో–ఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జున వివరించారు. వివరాల కోసం కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న మాధవరావు

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: రైతులు భూసార పరీక్షల ఫలితాల ఆధారంగానే పొలాల్లో రసాయన ఎరువులు వాడాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. బుధవారం రాజవోలు గ్రామంలో మండల వ్యవసాయాధికారి ఏ.భీమరాజు అధ్యక్షతన క్షేత్రస్థాయిలో నిర్వహించిన పొలంబడి రైతుల శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పంటకు కావలసిన ముఖ్యమైన పోషకాలను క్షుణ్ణంగా వివరించారు. శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ, వరిలో సమగ్ర సస్య రక్షణ, విత్తనం ఎంపిక చేసుకునే విధివిధానాలు, ఎరువులు, నీటి, కలుపు మందుల యాజమాన్యం తదితర అంశాలను విశదీకరించారు. రాజమహేంద్రవరం రూరల్ సహాయ వ్యవసాయ సంచాలకుడు డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం వరిపంటలో ప్రకృతి వ్యవసాయ, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు ఆచరించడం వలన వరి పంటకు తెగుళ్లు, పురుగుల ను తట్టుకునే శక్తి చేకూరుతుందన్నారు. అధిక దిగుబడికి ఇదెంతో అవసరమని తెలిపారు. ఏరిస్ ప్రతినిధి రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన స్టాళ్లు, ప్రదర్శించిన ఉత్పత్తులను రైతులకు వివరించారు. రాజమండ్రి సబ్ డివిజన్ మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

తలసేమియా బాధితుల కోసం రక్తదానం

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో జంతు శాస్త్ర విభాగం, యూత్ రెడ్ క్రాస్, ఎన్‌సీసీ విభాగం సమన్వయంతో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ, విద్యార్థులకు రక్తదానం వలన కలిగే ఉపయోగాలను వివరించారు. స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని ప్రోత్సహించారు. జంతుశాస్త్ర విభాగాధిపతి కె.బాబు మాట్లాడుతూ, ఈ రక్తదానాన్ని తలసేమియా బాధితుల కోసం ఇస్తున్నామని చెప్పారు. జంతుశాస్త్ర పరిశోధన ల్యాబ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని రెడ్ రిబ్బన్ క్లబ్ కో–ఆర్డినేటర్ రవితేజ, ఎన్‌సీసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ డి.సుబ్‌బాష పర్యవేక్షించారు. హెచ్‌డీఎఫ్‌సీ


శిబిరంలో రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్

సిటీ ఆపరేషన్స్ ఎ.సురేష్, పండ్లు, రెడ్ క్రాస్ బ్యాడ్జీలను రక్తదాతలకు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, యూత్ రెడ్ క్రాస్ కమిటీ మెంబర్లు డాక్టర్ సురేష్, విజయశాంతి, డాక్టర్ అనూష, సీతామహాలక్ష్మి, రమణ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత
- కలెక్టర్‌తో కలిసి క్యాండిల్ ర్యాలీ ప్రారంభం


క్యాండిల్ ర్యాలీలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, కలెక్టర్ ప్రశాంతి తదితరులు

ఆల్కాట్‌తోట(రాజమహేంద్రవరం రూరల్): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, చిన్న వయస్సులో వివాహం చేయడం వల్ల బాలికల విద్య, ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం చూపుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి పుష్కర్ ఘాట్ వరకు × బాల్ వివాహ ముక్త్ భారత్ ౯ జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్యాండిల్ ర్యాలీని ఆమెతో పాటు, కలెక్టర్ పి.ప్రశాంతి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ, బాల్ వివాహ ముక్త్ భారత్ జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు హైకోర్టు సూచనలతో జిల్లాలో బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. బాల్య వివాహాలను నిరోధించేలా ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. 18 ఏళ్లలోపు ఆడ పిల్లలకు, 21 ఏళ్లలోపు మగ పిల్లలకు వివాహం చేస్తే చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. అలా చేసిన వారికి రెండేళ్ల వరకు జైలు శిక్ష తప్పదన్నారు. బాల్య వివాహాలు చేస్తున్నట్లు ఎక్కడైనా సమాచారం ఉంటే, వాటిని నిరోధించేలా వెంటనే గ్రామ స్థాయి అడ్మినిస్ట్రేషన్ అధికారి లేదా జిల్లా స్థాయిలో కలెక్టర్‌కు సమాచారాన్ని అందించాలన్నారు. పారా లీగల్ వలంటీర్లు, లీగల్ ఎయిడ్ క్లినిక్స్, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ద్వారా ఆ బాల్య వివాహాలను నిరోధించి, వారికి రక్షణ కల్పిస్తారన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ, దేశాన్ని బాల్య వివాహ రహితంగా మార్చడానికి ఈ కార్యక్రమం ఉద్దేశించిందన్నారు. జిల్లాలో లీగల్ సర్వీస్ అథారిటీ, జిల్లా అడ్మినిస్ట్రేషన్ సమన్వయంతో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దీనిపై సమాజంలో, పెద్దఎత్తున అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని 2006లో తెచ్చినప్పటికీ, అక్కడక్కడా బాల్య వివాహాలు జరగటం విచారకరమన్నారు. ఏ ఒక్క బాల్య వివాహం నమోదు కాకూడదని లక్ష్యంతో జిల్లాలో మహిళా, శిశు సంక్షేమ శాఖ, విద్య, జీఎస్‌డబ్ల్యూ, రెవెన్యూ, పంచాయతీ, న్యాయ శాఖ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేస్తున్నామన్నారు. బాల్య వివాహాలు సాంఘిక దురాచారమన్నారు. ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతతో అందరికీ అవగాహన కల్పిద్దామన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, కలెక్టర్ స్థానిక పుష్కర్ ఘాట్ వద్ద బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి కె. విజయకుమారి, జిల్లా అధికారులు, అంగన్‌వాడీ, ఆశా, మహిళా పోలీసులు, న్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 29న ప్రైవేట్ చానళ్లు నిర్వహిస్తున్న శివపార్వతుల కల్యాణ మహోత్సవం నేపథ్యంలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్టు ఎస్పీ డి.నరసింహ కిషోర్, ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వరరావుతెలిపారు.

- దివాన్‌చెరువు వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు లాలా చెరువు, ఏవీ అప్పారావు రోడ్డు, రామాలయం మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుతాయి.
- ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే బస్సులను హైటెక్ బస్టాండ్, చిరంజీవి బస్టాండ్, క్వారీ సెంటర్, లాలా చెరువుగా మీదుగా ప్రయాణిస్తాయి.
- లాలా చెరువు నుంచి సాధారణ వాహనాలను వైఎస్సార్ విగ్రహం నుంచి క్వారీ మార్కెట్ మీదుగా మళ్లించారు.
- కంబాలచెరువు వైపు నుంచి వచ్చే వాహనాలను చిరంజీవి బస్ స్టాప్, క్వారీ మార్కెట్ మీదుగా మళ్లించారు.
- వై.జంక్షన్ నుంచి సీటీఆర్ఐ జంక్షన్ వరకు ఏ విధమైన వాహనాలకు అనుమతి లేదు.
- లాలా చెరువు వైపు నుంచి ఆర్ట్స్ కాలేజీలో జరుగుతున్న కార్యక్రమానికి కార్లు, ద్విచక్ర వాహనాలపై వచ్చే భక్తులు జడ్జి బంగ్లా మీదుగా, ఆర్ట్స్ కాలేజీ వెనుక గేటు నుంచి లోనికి ప్రవేశించాలి.
- కంబాలచెరువు వైపు నుంచి ఆర్ట్స్ కాలేజీకి కార్లు, ద్విచక్ర వాహనాలపై వచ్చే భక్తులు జడ్జి బంగ్లా మీదుగా ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్, ఈట్ స్ట్రీట్ మీదుగా ఆర్ట్స్ కళాశాల వెనుక గేటు ద్వారా లోనికి ప్రవేశించాలి..
- కాలినడకన వచ్చే భక్తులు ఆర్ట్సు కాలేజీ మెయిన్ గేట్ నుంచి లేదా రెండో గేటు నుంచి లోనికి ప్రవేశించాలి.

సాగులో మూస విధానం శ్రేయస్కరం కాదు

పర్యావరణ వేత్త విజయ్‌రామ్


సదస్సులో మాట్లాడుతున్న విజయ్‌రామ్

రాజానగరం: తక్కువ కాలంలో అధిక దిగుబడులు సాధించాలనే తపనతో మూస పద్ధతిలో సాగు చేయడం భూసారానికి నష్టం కలిగించడమే అవుతుందని సుభాష్ పాలేకర్ కృషి విధాన ప్రచారకులు విజయ్‌రామ్ అన్నారు.
దీనిని రైతాంగం సరిదిద్దుకోవలసిన అవసరం ఉందని చెప్పారు. దివాన్‌చెరువులో గోఆధారిత ప్రకృతి వ్యవసాయం పై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో విజయ్‌రామ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కూలీల సమస్యలతో ప్రస్తుతం అనేక ప్రాంతాలలో వరి కోతలకు యంత్రాలను వినియోగిస్తున్నారని, దీనివలన కూడా భూమి సున్నితత్వం దెబ్బతింటుందన్నారు. భూ సమతుల్యతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. దీనిని విస్మరించి మూస పద్ధతిలో సాగు చేసుకుంటూపోతే భూతాపం పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కారణంగా భూ సమతుల్యతను పాటిస్తూ ఐదంచెల విధానంలో సాగు చేయడం అత్యుత్తమంగా ఉదహరించారు. ఈ విధానంలో అంతర్ పంటలు, దుంపలు వంటివి ఉంటాయన్నారు. దీని ద్వారా ఎకరాకు రూ.ఆరు లక్షల వరకు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. అలాగే చేపలు, రొయ్యల పెంపకం చేసేవారు కూడా ఆ ప్రాంతంలో ఒక ఎకరాన్ని ఐదంచెల సాగుకు వినియోగించి, సత్ఫలితాలను పొందవచ్చన్నారు. కాలుష్యం పెరిగిపోతున్న ప్రస్తుతం సమయంలో ప్రకృతి సాగు ఎంతో లాభదాయకమన్నారు. దీనిపై ప్రజలను మరింత చైతన్యపరిచే దిశగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నుంచి 24 వరకు హైదరాబాద్‌లో పది వేల మంది రైతులకు అవగాహన సదస్సును నిర్వహించదలచామని వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు సోము వీర్రాజు, సదస్సు నిర్వాహకులు అంబటి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

రాజమహేంద్రవరం రూరల్: కడుపునొప్పి తాళలేక పురుగు మందు తాగి రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు, రాజమహేంద్రవరానికి చెందిన బి.లక్ష్మీనారాయణ(60) దామెర్ల ఆర్ట్ గ్యాలరీలో కేర్‌టేకర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆరు నెలలుగా విపరీతమైన కడుపు నొప్పితో బాధపడుతున్న అతడు మూడు రోజుల క్రితం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడు. అతడిని చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. అతడి భార్య లిల్లీ ఫిర్యాదు మేరకు త్రీటౌన్ ఎస్సై సుభాని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పర్వతారోహణలో పాల్గొన్న వైద్య విద్యార్థులు

రాజానగరం: మనాలీలో అటల్ బిహారీ వాజ్‌పాయ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటినీరింగ్ సంస్థ నిర్వహించిన పర్వతారోహణలో స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల విద్యార్థులు ముళ్లపూడి చైతన్యరాజ్, కెన్నీటి హర్ష పాల్గొన్నారు. సాహసోపేతమైన ఈ పర్వతారోహణకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన 90 మంది విద్యార్థులలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఈ ఇద్దరితో పాటు, 10 మంది ఉన్నారు. వీరిలో చైతన్యరాజ్ దేశ వ్యాప్తంగా ఉన్న రోప్ లీడర్లు, వలంటీర్లకు నాయకత్వం వహించి, 'కోర్సు సీనియర్' హోదాను అందుకున్నాడు. క్లైంబింగ్, రాపెల్లింగ్, రివర్ క్రాసింగ్ మొదలైనవి కూడా మౌంటనీరింగ్ అడ్వెంచర్‌లో ఉంటాయి. ఈ సందర్భంగా కళాశాల చీఫ్ మెంటర్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ఎండీ డాక్టర్ గన్ని సందీప్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌కే మిశ్రా, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ వాణీ మాధవి సాహసోపేత యాత్ర చేసిన విద్యార్థులను అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

రాజకీయాల్లో మహిళల పాత్ర కీలకం కావాలి

యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి మమత


కార్యక్రమంలో మాట్లాడుతున్న మమత నాగిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: మహిళలు రాజకీయాల్లోకి వచ్చి, నాయకులుగా రాణించాలని యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి, ఏపీ ఇన్‌చార్జి మమత నాగిరెడ్డి అన్నారు.
జాతీయ యువజన కాంగ్రెస్ ఆదేశాల మేరకు శక్తి అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం స్థానిక రాజమహేంద్రి మహిళా కళాశాలలో నిర్వహించారు. యువజన కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జి కొల్లి రామసూరిరెడ్డి, అధ్యక్షతన, జిల్లా అధ్యక్షుడు బిల్డర్ బాబి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మమత నాగిరెడ్డి మాట్లాడుతూ, మహిళలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని, రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలన్నారు. దేశ రాజకీయాల్లో ఇందిరాగాంధీ, సోనియా గాంధీ, ఇప్పుడు ప్రియాంక గాంధీ తమదైన ముద్ర వేశారని చెప్పారు వారి బాటలో నేటితరం మహిళలు నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొందిలి రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎముకల సాంద్రత ఉచిత పరీక్షలు


ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాజమహేంద్రవరం సిటీ: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, కేఎస్ఆర్ హాస్పిటల్ సంయుక్తాధ్వర్యంలో బుధవారం ఉచిత (బీఎండీ) ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ డాక్టర్ కొమ్మా శ్రీనివాస్, డాక్టర్ సుస్మిత పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, 45 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. మహిళలు అధిక పోషక విలువలు ఉండేలా పాలు పండ్లు తదితర వాటిని ఆహారంలో తీసుకోవాలన్నారు. నిత్యం శరీరానికి 20 నిమిషాల పాటు సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఉప్పల శ్రీను, ప్రతినిధులు సాయిబాబా, బీఎస్ఎన్ మూర్తి, బోదిరెడ్ల అప్పారావు, తమ్మా రవి, మురళి, ఎంవీ ధర్మారెడ్డి, ఏ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల:	మెకానిక్ రాకీ
సూర్యమినీ:	క
సూర్యప్యాలెస్:	మెకానిక్ రాకీ
శివజ్యోతి:	జీబ్రా
అనుశ్రీ:	దేవకి నందన వాసుదేవ
స్వామి:	అమరన్
అశోక:	లక్కీ భాస్కర్
రాజా:	క
రంభ:	మందిర
ఊర్వశి:	కంగువా
మేనక:	కేశవ చంద్ర రమావత్
కుమారి:	జీబ్రా
అప్సర:	మట్కా, లక్కీ భాస్కర్
నామవరం:	
వీఎస్ మహల్:	మెకానిక్ రాకీ
ధవళేశ్వరం:	
మురళీకృష్ణ:	జీబ్రా
కడియం:	
వెంకటసూర్య:	మెకానిక్ రాకీ